సాక్షి
రంగారెడ్డి
శనివారం । 13 । జనవరి । 2024



అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అంద జేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. 10లో▸



గంధపు చెట్ల నరికివేత

రాత్రికిరాత్రే గంధపు చెట్లను నరికి తరలించుకుపోయారు. ఈ సంఘటన గడ్డమల్లయ్య గూడలో గురువారం చోటుచేసుకుంది. 10లో▸



రాయితీ సిలిండర్లు పక్కదారి!

ఇబ్రహీంపట్నంలో హోటళ్లకు సరఫరా అవుతున్న గ్యాస్ బండలను పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ తనిఖీ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

మనోవికాసానికి క్రీడలు దోహదం



మాట్లాడుతున్న డీఈఓ సుశీందర్ రావు

తుర్కయంజాల్: విద్యార్థుల మనోవికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని డీఈఓ సుశీందర్ రావు అన్నారు. తుర్కయంజాల్‌లోని ఇండస్ వ్యాలీ స్కూల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఖేలోత్సవ్ 1.0 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్, చైర్మన్ కె. సుధీర్, సెక్రటరీ టి.రాఘవ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా టేనావతి



అవార్డు అందుకుంటున్న మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టేనావతి

చేవెళ్ల: రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా చేవెళ్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టేనావతి ఎంపికయ్యారు. సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

మోకిల పంచాయతీ కార్యదర్శి సస్పెండ్



లక్ష్మీతులసి

శంకర్‌పల్లి: మోకిల పంచాయతీ కార్యదర్శి లక్ష్మీతులసి సస్పెండ్‌కు గురయ్యారు. పారిశుద్ధ్యంలో నిర్లక్ష్యం, 284 ఇళ్లకు జీరో టాక్స్ చేయడం, మరికొన్ని అవినీతి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ శశాంక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆమెపై మాజీ సర్పంచ్ అడివయ్య, వార్డు సభ్యులు, పలువురు గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. విచారణలో ఆరోపణలు రుజువు కావడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

డేటా ఎంట్రీలో తప్పిదాలు ఉండొద్దు

శంకర్‌పల్లి: డేటా ఎంట్రీలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ శంకర్ సింగ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చేపట్టిన దరఖాస్తుల కంప్యూటరీకరణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును నమోదు చేయాలని సూచించారు. ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

ప్రవేశాలకు సన్నద్ధం

- మహేశ్వరం మెడికల్ కాలేజీలో అడ్మిషన్లకు సన్నాహాలు
- 2024–25 విద్యా సంవత్సరంలో తరగతులు ప్రారంభం
- మీర్‌ఖాన్‌పేటలో భూమి కేటాయింపు.. ఇప్పటికే శంకుస్థాపన
- తాత్కాలికంగా ప్రైవేటు భవనంలో ఏర్పాటు చేసే యోచన
- ప్రిన్సిపాల్‌గా గాంధీ ఆర్థోపెడిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ సత్యనారాయణ



మహేశ్వరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించిన వైద్య బృందం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మహేశ్వరం మెడికల్ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త మెడికల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా గాంధీ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి, ప్రొఫెసర్ సత్యనారాయణను నియమించింది. తరగతుల నిర్వహణకు అనువైన భవనాన్ని కూడా గుర్తించాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మొదటి ఏడాది 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ చేయనుంది. క్రమంగా సీట్ల సంఖ్యను పెంచనుంది. మెడికల్ కాలేజీ రాక, అడ్మిషన్ల ప్రక్రియ మొదలుతో మహేశ్వరం నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి.

మీర్‌ఖాన్‌పేటలో శంకుస్థాపన

సామాన్యులకు సైతం వైద్య విద్యను అందించాలనే ఆలోచనలో భాగంగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లాకో మెడికల్ కాలేజీ చొప్పున మంజూరు చేసిన విషయం తెలిసిందే. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మీర్ ఖాన్‌పేట సర్వే నంబర్ 112లో ఈ కొత్త మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు టీఎస్‌ఐఐసీ 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఈ మెడికల్ కాలేజీకి కేటాయించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రూ.160 కోట్లతో మెడికల్ కాలేజీ భవన నిర్మాణం సహా 400 పడకల ఆస్పత్రి భవనానికి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి పాలై.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం తెలిసిందే.

ప్రైవేటు భవనం కోసం అన్వేషణ

మరికొద్ది నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో 2024–25 విద్యా సంవత్సరంలో 50 ఎంబీబీఎస్ సీట్లను భర్తీ చేసి, విద్యార్థులకు తరగతులు బోధించాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఇప్పటి వరకు అక్కడ భవనం పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించింది. కొత్త భవనం నిర్మించి, అందుబాటులోకి వచ్చే వరకు తాత్కాలికంగా ఏదైనా ప్రభుత్వ /ప్రైవేటు భవనంలో తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా కందుకూరు, తుక్కుగూడ, మహేశ్వరం మధ్యలో అనువైన భవనాన్ని గుర్తించాల్సిందిగా రెవెన్యూ అధికారులకు సూచించినట్లు తెలిసింది.

మహేశ్వరంలో పర్యటించిన బృందం

మెడికల్ కాలేజీ ఏర్పాట్ల పరిశీలన కోసం సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ డైరెక్టర్ విమలా థామస్, మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సత్యనారాయణ, నిజామాబాద్ ప్రభుత్వ వైద్యశాల విభాగాధిపతి డాక్టర్ కేజే కిషోర్ కుమార్ నేతృత్వంలో ఓ కమిటీని కూడా నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఈ వైద్య బృందం మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రతిపాదిత ప్రదేశంతో పాటు మహేశ్వరం, షాద్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను కూడా సందర్శించింది. మెడికల్ కాలేజీ ఏర్పాటు ఆవశ్యకత, వాటి పరిధిలోకి వచ్చే ఆరోగ్య కేంద్రాలు, చికిత్సల కోసం వస్తున్న రోగుల వివరాలపై ఆరా తీసిన వైద్య బృందం ప్రభుత్వానికి రిపోర్టు ఇవ్వనుంది.

వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలి

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

చేవెళ్ల: ప్రపంచానికి భారత దేశ గొప్పతనాన్ని చాటిచెప్పిన మహనీయుడు స్వామి వివేకానందుడని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలో స్థల దాత రమణారెడ్డి, సర్పంచ్ బండారి శైలజఆగిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గత పాలకులు ఈ ప్రాంతానికి రావాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును రాకుండా అడ్డుకోవటమే కాకుండా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును కూడా డిజైన్ మార్చి నీళ్ల రాకుండా చేసి తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా అందరం కలిసి పూర్తిగా వర్షాధార ప్రాంతమైన.. వెనకబడి ఉన్న ఈ ప్రాంతానికి నీరు తీసుకువద్దామని పిలుపునిచ్చారు. ప్రముఖ వక్త భాస్కరయోగి, చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ సంస్కృతి, సంప్రదాయాలను, హిందుభావాజాలం గొప్పతనాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి వివేకానందుడని కొనియాడారు. యువతతోనే దేశభవిష్యత్తు మారుతుందని బలంగా నమ్మిన వ్యక్తి అన్నారు. ఆయన చూపించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, జెడ్పీటీసీ మర్పల్లి మాలతి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీ వసంతం, మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు సమత తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

వసతి గృహం సందర్శన

కడ్తాల్: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమశాఖ బాలుర వసతి గృహం, ఆశ్రమ పాఠశాలను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ శుక్రవారం సాయంత్రం అధికారులతో కలిసి సందర్శించారు. జన్‌మన్ (జన జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15న కడ్తాల్, ఆమనగల్లు మండలాల చెంచు కుటుంబాలతో ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వర్చువల్ మీటింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతిగృహ ప్రాంగణాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశానికి కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో నివసించే చెంచులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని చెంచు సంఘం నాయకులతో ఈ నెల 15న నిర్వహించనున్న సమావేశానికి సంబంధించిన పలు విషయాలపై అడిషనల్ కలెక్టర్ వారితో మాట్లాడారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్, జిల్లా స్పెషలాఫీసర్ పద్మ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి రామేశ్వరి దేవి, డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ షేక్ ముంతాజ్, ఎంపీడీవో రామకృష్ణ, స్థానిక సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, సీడీపీవో సక్కుబాయి, పీఆర్ ఏఈ పరమేశ్, ఏవో శ్రీలత, ఎంపీవో మధుసూదనాచారి, వసతిగృహ సంక్షేమ అధికారి రాములు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్

బండ్లగూడ మేయర్‌కు అవిశ్వాస పరీక్ష

- కలెక్టర్‌కు డిప్యూటీ మేయర్‌తో కలిసి 16 మంది కార్పొరేటర్ల ఫిర్యాదు



కలెక్టర్ శశాంకకు తీర్మాన పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్‌ఎస్ పార్టీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం కోసం ప్రయత్నాలు ఊపందుకున్నాయి. అవిశ్వాసానికి పట్టుపడుతున్న వారిలో బీఆర్‌ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు 13 మందితో పాటు ఇద్దరు కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఒక బీజేపీ కార్పొరేటర్ ఉన్నారు. వీరంతా శుక్రవారం డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో కలెక్టర్ శశాంకను కలిసి ఫిర్యాదు చేశారు. కార్పొరేషన్ పరిధిలో మొత్తం 22 మంది కార్పొరేటర్లు ఉండగా అందులో 16 మంది అవిశ్వాస తీర్మానం కోరుకుంటున్నారు. అధిక శాతం సభ్యులు మేయర్ పాలన నచ్చడం లేదని నిర్మొహమాటంగా స్పష్టం చేస్తున్నారు. గతంలోనూ పలుమార్లు కార్పొరేటర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పడంతో అప్పట్లో వివాదం సద్దుమణిగింది.

అవిశ్వాస తీర్మానం కోరుకుంటుంది వీరే..

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్‌పై ఫిర్యాదు చేసిన వారిలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు తలారీ చంద్రశేఖర్, మాలతీనాగరాజు, సంతోషిరాజిరెడ్డి, లతాప్రేమ్‌గౌడ్, శ్రావంతినరేందర్, అనిత వెంకటేష్, అస్లాంబిన్ అబ్దుల్లా, శ్రీనాథ్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నిఖిలసంగారెడ్డి, ఆసియాఖాజా, ముద్దం రాము, ప్రశాంత్‌నాయక్, పుష్పమ్మ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సేవల గుర్తింపునకు అవార్డు

నందిగామ: కొన్నేళ్లుగా యువతలో మార్పు తెచ్చేందుకు నిబద్ధతతో చేసిన సేవలను గుర్తించి కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్‌కు 'చేంజ్ మేకర్' అవార్డు అందజేసినట్లు శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ గురూజీ కమ్లేష్ పటేల్ అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కాన్హా శాంతి వనంలోని హార్ట్‌ఫుల్ నెస్ కేంద్రంలో మూడు రోజుల పాటు 'యూత్ యూనిటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపురోజైన శుక్రవారం నేషనల్ యూత్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరన కమ్లేష్ పటేల్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా యువతలో పెద్ద ఎత్తున మార్పు తెచ్చేందుకు కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. అలాంటి ప్రముఖ ప్రజా సేవకురాలిని హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ తరఫున చేంజ్ మేకర్ అవార్డుతో సత్కరించడం సంతోషంగా ఉందన్నారు. మూడు ఖండాల్లోని 50 దేశాలకు చెందిన సుమారు లక్ష యాభై వేల మంది యువత వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొనగా 14 వేల మంది ప్రత్యక్షంగా పాల్గొన్నారని నిర్వాహకులు తెలిపారు. కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ ప్యాట్రిసియా స్కాట్లాండ్ మాట్లాడుతూ.. భవిష్యత్తు అంతా యువత చేతుల్లోనే ఉందని, యువత చిన్నప్పటినుంచే సన్మార్గంలో నడవాలని, స్వామీ వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ఆధ్వర్యంలో అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. మరింత ఉత్సాహంగా పనిచేసి యువతను కామన్‌వెల్త్‌లో అధికంగా పాల్గొనేలా ప్రయత్నిస్తానని చెప్పారు. ఈనంతరం 2023లో యునైటెడ్ స్టేట్స్‌లో అత్యధికంగా అమ్ముడైన స్పిరిచ్యువల్ అనాటమీ పుస్తకాన్ని గురూజీ కమ్లేష్ పటేల్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హార్వర్డ్ స్పీకర్, జేయూఎస్పీ చైర్మన్ డాక్టర్ టోని నాడర్, పలువురు విద్యార్థులు, విదేశీయులు పాల్గొన్నారు.



ప్యాట్రిసియా స్కాట్లాండ్‌కు అవార్డు అందజేస్తున్న గురూజీ కమ్లేష్ పటేల్

క్లీన్ సిటీగా ఇబ్రహీంపట్నం

సౌత్ రీజియన్‌లో 5వ ర్యాంక్

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని క్లీన్ సిటీగా గుర్తిస్తూ సర్టిఫికేషన్ ప్రకటించింది. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 కింద కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సౌత్ ఇండియా రీజియన్‌లో పరిధిలో చేపట్టిన స్వచ్ఛ సిటీ కోసం 326 మున్సిపాలిటీలు పోటీపడ్డాయి. అందులో 5,096 మార్కులు.. 5వ ర్యాంక్‌తో బెస్ట్ క్లీన్ సిటీగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ నిలిచింది. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం.. చెత్తాచెదారం లేకుండా పారిశుద్ధ్య మెరుగు కోసం చేపట్టిన చర్యలు.. ఇంటింటికీ తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిత్యం డంపింగ్ యార్డుకు తరలించడం.. రోడ్లపై చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం.. మురికి కాలువలు, నాలాలను క్లీన్‌గా ఉంచడం.. ప్లాసిక్ వినియోగం తగ్గించడం తదితర కార్యక్రమాలతో పట్నం మున్సిపాలిటీ ముందు వరుసలో నిలిచింది. వీటిన్నింటినీ పరిగణలోకి తీసుకొని కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వశాఖ సర్టిఫికెట్ జారీ చేసింది.

బాధ్యత పెంచింది

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బెస్ట్ క్లీన్ సిటీగా గుర్తించడం సంతోషించదగ్గ పరిణామం. ఇది మా బాధ్యతను మరింత పెంచింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా పట్టణాన్ని అన్నివిధాలా పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు. పాలకవర్గం, అధికార యంత్రాంగం, సిబ్బంది సహకారం, కృషి ఫలితంగానే ఈ గుర్తింపు దక్కింది.

– రవీంద్రసాగర్, మున్సిపల్ కమిషనర్

అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన కేసును పోలీసులు ఛేదించారు. మొదట హత్యగా అనుమానించి.. ఆరు బృందాలతో దర్యాప్తు చేపట్టారు. నాలుగు రోజులు శ్రమించి సీసీ ఫుటేజీ, సెల్‌ఫోన్ ఆధారంగా ఆమెది హత్య కాదు.. ఆత్మహత్య అని తేల్చారు. కలిసి చదువుకున్న స్నేహితురాలితో ఏర్పడిన ప్రేమబంధం దూరమవుతుందనే మనస్తాపంతోనే సదరు యువతి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించారు.

స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేకే..

- నిప్పంటించుకుని యువతి ఆత్మహత్య
- సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ నంబర్ ఆధారంగా దర్యాప్తు
- మంటల్లో కాలిన గుర్తుతెలియని మహిళ మృతి.. కేసును ఛేదించిన పోలీసులు
- మృతురాలు మల్లేపల్లివాసి తహసీన్‌బేగంగా గుర్తింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

మొయినాబాద్: మండల పరిధిలోని బాకారం శివారు డ్రీమ్ వ్యాలీ రోడ్డు పక్కన ఈనెల 8న కాలుతున్న యువతి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మంటలు ఆర్పారు. అప్పటికే యువతి శరీరం గుర్తు పట్టలేనంతగా కాలిపోయింది. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టారు.

ఆరు బృందాలుతో దర్యాప్తు...

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. కొద్ది దూరంలో ఉన్న రైతులతో మాట్లాడినా ఎలాంటి క్లూస్ దొరకలేదు. దీంతో రాజేంద్రనగర్ సీసీఎస్, మొయినాబాద్, శివరాంపల్లి, మైలార్‌దేవ్‌పల్లి పీఎస్‌ల నుంచి ఆరు బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు.

సీసీ ఫుటేజీ ఆధారంగా

ఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 1.43 గంటలకు టీఎస్ 13 యూసీ 1565 నంబరు గల ఆటో ఎనికేపల్లి నుంచి బాకారం వైపు వెళ్లి తిరిగి వచ్చినట్లు సోలార్ విల్లాస్ వద్ద ఉన్న సీసీ ఫుటేజీల్లో పోలీసులు గుర్తించారు. అదే ఆటో వెంటనే డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్స్ గేటు ముందు నుంచి యూటర్న్ తీసుకుని వెళ్లినట్లు సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. ఆటో నంబర్ ఆధారంగా మెహదీపట్నంలో ఆటో డ్రైవర్ సయ్యద్‌వాసిమ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు.

పథకం ప్రకారమే..

నగరంలోని మల్లేపల్లికి చెందిన తహసీన్‌బేగం(22) ఈనెల 8న ఉదయం 11.30 గంటలకు మొయినాబాద్‌లోని డ్రీమ్‌వ్యాలీ రిసార్ట్ వద్దకు వెళ్లాలని.. మల్లేపల్లిలో రూ.1,100కు సయ్యద్ వాసిమ్ ఆటో మాట్లాడుకుంది. ఆటో ఎక్కి మురాద్‌నగర్‌లోని తన స్నేహితురాలు రాహిల్ ఇంటికి వెళ్లింది. మధ్యాహ్నం 12.10 గంటలకు మరో స్నేహితురాలి ఇంటికి వెళ్లి.. అంతకు ముందురోజే అక్కడ తెచ్చిపెట్టుకున్న 5 లీటర్ల పెట్రోల్ డబ్బాను ఓ బ్యాగులో పట్టుకుని ఆటో ఎక్కింది. మధ్యాహ్నం 1.43 గంటలకు రిసార్ట్ గేటు వద్దకు వెళ్లగానే.. యూటర్న్ తీసుకోవాలని చెప్పి.. కొద్ది దూరం వెళ్లగానే ఆటో దిగి డ్రైవర్‌కు డబ్బులిచ్చి పంపించింది. మధ్యాహ్నం 1.53 గంటలకు రాహిల్‌కు ఫోన్ చేసి మాట్లాడి ఆతర్వాత స్విచ్ఛాఫ్ చేసింది. అనంతరం డబ్బాలో తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది.

అదే అసలు కారణం

మృతురాలు తహసీన్‌బేగం మెహిదీపట్నంలోని మదీనా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసింది. ఈ సమయంలో స్నేహితురాలు రాహిల్‌తో సాన్నిహిత్యం ఏర్పడింది. ఇది ఇద్దరి మధ్య ప్రేమగా మారింది. విషయం ఇంట్లో తెలియడంతో ఇరుకుటుంబాల వారు మందలించి ఇరువురినీ దూరం చేశారు. స్నేహితురాలి ఎడబాటును తట్టుకోలేని తహసీన్ ఆరు నెలల క్రితం బ్లేడుతో కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అయితే ఇటీవల రాహిల్‌కు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలియడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఆత్మహత్యకు ఒక రోజు ముందే పెట్రోల్ తీసుకుని తన స్నేహితురాలు గదిలో పెట్టింది. ఎందుకని అడగగా బంకులు బంద్ చేస్తున్నారని, బండిలో పోసుకునేందుకని నమ్మించింది.

విషయం తెలిసిందిలా..

ఘటనా స్థలంలో సగం కాలిన స్థితిలో దొరికిన సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు మృతురాలు చివరి కాల్ రాహిల్‌తో మాట్లాడినట్లు గుర్తించారు. ఆమెను విచారించగా ఈ విషయాలన్నీ బయటకొచ్చాయి. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు.

హబీబ్‌నగర్ పీఎస్ వద్ద ఉద్రిక్తత

సాక్షి, సిటీబ్యూరో/నాంపల్లి: యువతి మృతిపై విచారణ చేపట్టిన మొయినాబాద్ పోలీసులు తహసీన్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆగ్రహానికి గురైన బాధితులు హబీబ్‌నగర్ పీఎస్ వద్ద ఆందోళన చేపట్టారు. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి ఉంటే తహసీన్ సజీవంగా దక్కేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్వాల్ శ్రీనివాసరెడ్డి స్వయంగా వచ్చి పరిస్థితితో పాటు ఉదంతం పూర్వాపరాలను పరిశీలించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఠాణా వద్దకు చేరుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎంఐఎం కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. విషయం తెలుసుకున్న డీసీపీ చైతన్య, ఆసిఫ్‌నగర్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి పీఎస్ వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యేకు పరిస్థితి వివరించడతో విషయం సద్దుమణిగింది. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్‌కు చార్జ్ మెమో జారీ చేయగా.. ఎస్‌ఐ భాను ప్రకాశ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు.

క్లుప్తంగా

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్



జెర్సీలను అందజేస్తున్న విశాల తదితరులు

కేశంపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో కేశంపేట ప్రీమియర్‌లీగ్ క్రికెట్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. చదువైనా, ఆటలైనా యువతను భవిష్యత్తు బాటలో నడిపిస్తాయని పేర్కొన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఆటల వలన శారీరక దృఢత్వంతో పాటు మనసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, అల్వాల ఎంపీటీసీ సురేష్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, యుగేందర్, యాదయ్య ఉన్నారు.

తాళం పగులగొట్టి ఇంట్లో చోరీ

కొందుర్గు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుంజల్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కప్పెర సుశీల ఈ నెల 5న ఇంటికి తాళం వేసి తన పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లింది. తిరిగి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు ఇంటికి చేరుకుంది. ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన ఆమె.. ఇంట్లోకి వెళ్లిచూడగా బీరువా తాళం తొలగించి, మూడు తులాల బంగారు, 40 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.9 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. వెంటనే బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సక్రమ్ తెలిపారు.

అర్హులందరికీ ఆరు గ్యారంటీలు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి
- వెంకటాపూర్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభం

తలకొండపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. మండల పరిధి వెంకటాపూర్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి.. శుక్రవారం పర్యటించారు. తొలుత పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వాటర్ ట్యాంక్‌లు, సీసీరోడ్లు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాల, ప్రహరీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వైద్య సహాయాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. రేషన్ కార్డులు అందజేసి, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షల సహాయం అందజేస్తామని వెల్లడించారు. మౌలిక సదుపాయాలు కల్పించి గ్రామాలను అభివృద్ధి చేస్తామని, సాగునీరు అందించి, రైతులకు మేలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ యాదవ్, టీపీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీశైలం, వెంకట్రాంరెడ్డి, రాజేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీటీసీలు రమేష్, సునీత, అజీం, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్యగుప్తా, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అందరికీ ప్రాధాన్యత
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

యాచారం: అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి సేవ చేస్తానని, ఎన్నికలప్పుడే రాజకీయాలు, ఆ తర్వాత అందరికీ ప్రాధాన్యత ఇస్తానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం 20 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో గొప్పలకు పోయి.. అధిక అప్పులు తెచ్చి, రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. నేడు ఏ శాఖలో కూడా నిధులు లేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్థిక వనరులను గాడిలో పెడతారని తెలిపారు. ఇబ్రహీంపట్నంకు అధిక నిధులు తెచ్చి, వెనుకబడిన గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని వెల్లడించారు. బీఆర్ఎస్ సర్కార్‌లో.. ఆ పార్టీకి చెందిన వారికే సంక్షేమ పథకాలు అందేవని, కాంగ్రెస్ హయాంలో అర్హులకు న్యాయం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిలో పైరవీలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, వైస్ ఎంపీపీ శ్రీనువాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పరామర్శ

మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించారు. రామకృష్ణ తండ్రి ఎట్టయ్య వారం క్రితం మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. గునుగల్ గ్రామానికి వెళ్లి రామకృష్ణను పరామర్శించారు.

రాయితీ సిలిండర్లు పక్కదారి!

- హోటళ్లలో వాణిజ్య సిలిండర్లనే వాడాలి
- పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రఘునందన్

ఇబ్రహీంపట్నం: రాయితీ సిలిండర్లను గృహ వినియోగదారులకు అందించకుండా.. సరఫరా వాహనదారులు వాటిని పక్కదారి పట్టించి, సొమ్ము చేసుకుంటున్నారని పౌర సరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో హోటళ్లకు సరఫరా అవుతున్న గ్యాస్ బండలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడారు. హోటళ్లలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్లనే వాడాలని సూచించారు. అక్రమాలకు చెక్ పెట్టేందుకు అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని, అందులో భాగంగానే గ్యాస్ ఏజెన్సీల్లో ఎన్ని కనెక్షన్లు ఉన్నాయనే సమాచారం సేకరిస్తున్నట్లు వెల్లడించారు. గృహ వినియోగ బండలు రూ.వెయ్యి లోపే లభిస్తుండటంతో కొందరు వ్యాపారులు, కొంత ఎక్కువ మొత్తం చెల్లించి, వాటిని వినియోగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. సబ్సిడీ సిలిండర్లను వినియోగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



సిలిండర్ల వాహనాలను తనిఖీ చేస్తున్న డీటీ

ఏటీఎంలో చోరీకి యత్నించిన యువకుడి అరెస్ట్



నిందితుడు మోమిన్

పహాడీషరీఫ్: ఏటీఎంలో చోరీకి యత్నం చేసిన యువకుడిని పహాడీషరీఫ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మహ్మద్ అబ్దుల్ మోమిన్(27) కొన్నాళ్ల క్రితం జల్‌పల్లికి జీవనోపాధి కోసం వలస వచ్చాడు. కుటుంబ పోషణ భారం కావడంతో దొంగతనం చేసేందుకు నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 11న తెల్లవారు జామున 2 గంటలకు తుక్కుగూడలో హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంను ధ్వంసం చేసి డోర్ తెరిచాడు. కాని లోపల బాక్స్ తెరచుకోలేదు. దీంతో నిందితుడు పరారయ్యాడు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని పట్టుకున్నారు.

క్రీడల్లో మెరిసిన చేవెళ్ల విద్యార్థినులు

విజేతలను అభినందించిన అధ్యాపక బృందం

మొయినాబాద్ రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థినులు విజయం సాధించడం ఆనందంగా ఉందని పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. రెండు రోజులుగా ఘట్‌కేసర్‌లోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఈగ్నైట్ ఫెస్ట్‌లో.. రాష్ట్రంలోని అన్ని గురుకులాల 1,600 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ టోర్నీలో చేవెళ్ల గురుకుల విద్యార్థినులు స్పెల్‌బీ మణిదీప్తి (8వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచి రూ.7,500 నగదు బహుమతి పొందారు. ఉపాన్యాస పోటీల్లో కె.సాహితి(6వ తరగతి) తృతీయ స్థానంలో నిలిచి రూ.5 వేల నగదు అందుకున్నారు. ముఖాముఖి చర్చలో అస్రిత(ఇంటర్ మొదటి సంవత్సరం) తృతీయ స్థాయిలో రూ.5 వేలు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవి విజేతలను రాష్ట్ర గురుకులాల కార్యదర్శి నవీన్‌కోలాస్, జాయింట్ సెక్రటరీ శారదా, డిప్యూటీ సెక్రటరీ వెంకటలక్ష్మి, వెస్ట్ రిజియన్ ఆర్‌సీఓ డాక్టర్ శారద కలిసి అభినందించారు. రాష్ట్రంలోనే చేవెళ్ల పాఠశాల పేరు ప్రఖ్యాతులు సాధించడం అభినందనీయమని పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి శారద కొనియాడారు. ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

పండుగపూట విషాదఛాయలు

- సెలవులపై ఇంటికి వచ్చి.. తిరిగిరాని లోకాలకు
- విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

తలకొండపల్లి: పండుగపూట ఆ ఇంట్లో విషాదఛాయలు అలముకున్నాయి. సంక్రాంతి సెలవులకని ఇంటికి వచ్చి అనంత లోకాలకు వెళ్లింది. నిర్మాణంలో ఉన్న ఇంటికి నీరు కొట్టే యత్నంలో ఓ విద్యార్థిని మృత్యువాత పడింది. ఈ సంఘటన తలకొండపల్లి మండలం హర్యానాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధి లక్ష్మీతండాలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, తండా వాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన మూడావత్ శంకర్, శాంతిలు భార్యభర్తలు. వీరు కొత్తగా ఇంటిని నిర్మింపజేస్తున్నారు. వీరి కూతురు నందిని (13) మండల కేంద్రంలోని కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. పండుగ సెలవుల నిమిత్తం ఇంటికి వచ్చింది. శుక్రవారం ఉదయం నందిని నిర్మాణంలో ఉన్న తమ ఇంటికి నీరు కొట్టేందుకు వెళ్లింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న సంపు మోటార్ స్విచ్ ఆన్ చేయడానికి వెళ్లి విద్యుఘాతానానికి గురై మృత్యువాత పడింది. విద్యార్థిని అకాల మరణంతో తల్లిదండ్రులు, బంధువులు, తండావాసులు కన్నీటి పర్యంతం అయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.



నందిని మృతదేహం

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధి అన్నారం గ్రామ శివారు పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురూ ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నందిగామకు చెందిన అంజిరెడ్డి (40) కొంత కాలంగా జంటెక్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. శుక్రవారం విధులు నిర్వహిస్తున్న సమయంలో పరిశ్రమలో కరెంట్ షాక్‌కు గురై మృత్యువాత పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



అంజిరెడ్డి మృతదేహం

నిద్రిస్తున్న మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

పహాడీషరీఫ్: ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మెడలోని బంగారు మంగళ సూత్రాన్ని దుండగుడు తెంచుకొని ఉడాయించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన పావని, రమేశ్ దంపతులు పిల్లలతో గురువారం రాత్రి ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి పావని మెడలోని పుస్తెను లాగాడు. మెలకువ వచ్చిన ఆమె పుస్తెను పట్టుకోవడంతో నిందితుడు రెండు తులాల విలువైన గొలుసును లాక్కొని పరారయ్యాడు. ఈ విషయమై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి వైపు రాగా.. ఒకరు ఇంట్లోకి వెళ్లినట్లు సీసీ కెమెరాలో నమోదైనట్లు తెలిపారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

షాద్‌నగర్ రూరల్: చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఐ రాంరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన మహ్మద్ జావిద్, బాబానగర్‌కు చెందిన సయ్యద్ ఆసీఫ్‌లు షాద్‌నగర్ ప్రాంతంలో కొంత కాలంగా చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. నిందితులను శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వారి నుంచి 1.5 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సంక్రాంతి ప్రయాణం సాఫీగా



రాయికల్ టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

షాద్‌నగర్: సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నగర వాసులు సొంతూర్లకు పయనమవుతున్నారు. ముఖ్యంగా ఏపీలోని కర్నూల్, అనంతపూర్, కడప తదితర ప్రాంతాలతో పాటు కర్ణాటక, మహబూబ్‌నగర్, గద్వాల వైపు వెళ్లే వారు 44వ జాతీయ రహదారిలో వెళ్తున్నారు. దీంతో షాద్‌నగర్ పరిధి జడ్చర్ల ఎక్స్‌ప్రెస్‌వే టోల్ ప్లాజా మీదుగా వాహనాల రద్దీ పెరగగా.. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. దీంతో రద్దీ ఉన్నప్పటికీ.. ప్రయాణం సాఫీగా సాగుతుందని పలువురు వాహనదారులు తెలిపారు.

గంధపు చెట్ల నరికివేత

- రాత్రికిరాత్రే తరలింపు
- ఐదు గొర్రెల అపహరణ
- దర్యాప్తు చేపట్టిన పోలీసులు

యాచారం: రాత్రికిరాత్రే గంధపు చెట్లను నరికి తరలించుకుపోయారు. ఈ సంఘటన గడ్డమల్లయ్యగూడలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పరిధిలో గంధం చెట్లను పెంచుతున్నారు. దీనిని పసిగట్టిన గుర్తు తెలియని కలప దొంగలు, చింతపల్లి బోజిరెడ్డి, వరికుప్పల యాదయ్య, కత్తిరెడ్డి వెంకట్‌రెడ్డి, యార యాదగిరి, బత్తుల రాజశేఖర్‌రెడ్డి, చింతపల్లి వినాయకరెడ్డి తదితర రైతులకు చెందిన వ్యవసాయ పొలాల్లో పెరుగుతున్న 25కు పైగా పదేళ్ల వయసున్న చెట్లను నరికి ఎత్తుకెళ్లారు. తరలించిన కలప విలువ రూ.10 లక్షలకు పైగా ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. అంతే కాకుండా అటవీ ప్రాంతంలో ఉన్న అచ్చెన వెంకటయ్య మందలోని 5 గొర్రెలను సైతం ఎత్తుకెళ్లారు. రైతులు శుక్రవారం ఉదయం తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చూడా విషయం వెలుగు చూసింది. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటయ్య తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదయ్య తెలిపారు.



నరికేసిన గంధం చెట్లు

హోమో సెక్స్‌కు ఒత్తిడి చేస్తున్నాడనే..



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సునితా రెడ్డి

- వేధింపులు, బెదిరింపులు తట్టుకోలేకే స్నేహితుల దురాగతం
- రౌడీషీటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్
- కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

పహాడీషరీఫ్: రౌడీషీటర్‌ను హత్యచేసిన సంఘటనలో 24 గంటల్లోనే ఎనిమిది మంది నిందితులను బాలాపూర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. తుక్కుగూడలోని తన కార్యాలయంలో శుక్రవారం మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి, ఎస్ఓటీ డీసీపీ మురళీధర్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. కొత్తపేట అబుబకర్ కాలనీకి చెందిన బాలాపూర్ రౌడీషీటర్ ముబారక్ సిగార్‌ను, బుధవారం అర్ధరాత్రి దుండుగులు దారుణంగా కత్తులతో పొడిచి హత్య చేసిన విషయం తెలిసిందే. ముబారక్‌కు షాహీన్‌నగర్ క్యూబా కాలనీకి చెందిన రౌడీషీటర్ షేక్ ఇస్మాయిల్ అలియాస్ ఆదిల్(27) స్నేహితుడు. ఆదిల్‌కు మరో రౌడీషీటర్ షేక్ అమీర్(26)లతో పాటు నసీర్(23), షేక్ హుస్సేన్(22), అబ్దుల్ ఫరీద్ ఖాన్(20), ఖాజా(20), రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ ఇలియాస్(23), షాహీన్‌నగర్‌కు చెందిన సమీర్(21)లుగా ఉన్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 7న క్యూబా కాలనీలో షేక్ జమీర్, ఖాజాలు నిలబడి ఉండగా.. వారి వద్దకు వచ్చిన ముబారక్ ఖాజా వద్ద నుంచి బలవంతంగా రెండు సెల్‌ఫోన్లను లాక్కున్నాడు. అదే రోజు సాయంత్రం అమీర్ ముబారక్ నుంచి ఫోన్లను ఇప్పించాడు. ఇతనితో పాటు మిగిలిన స్నేహితుల నుంచి కూడా ఇదే మాదిరిగా డబ్బులు, ఫోన్‌లు, బైక్‌లు కూడా లాక్కోవడంతో పాటు హోమో సెక్స్ చేయాలని బెదిరింపులకు పాల్పడేవాడు. అమీర్ అడగడంతో బైక్‌లు మాత్రమే ఇచ్చిన ముబారక్.. ఫోన్లు, నగదు ఇవ్వకపోవడం.. తరచూ వేధింపులకు పాల్పడుతుండడంతో ఇతన్ని ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. సాధారణంగానే ఈ నెల 10న రాత్రి వాదే ముస్తఫాకు ముబారక్ చేరుకోవడం.. అదే సమయంలో నిందితులు కూడా అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నెలకొన్న వివాదంలో మాటామాట పెరిగి ముబారక్ సిగార్‌ను కత్తులతో పొడిచి చంపారు. మహేశ్వరం అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ జంగయ్య తదితరులు వివరాలు వెల్లడించారు.

బాలికపై సవతి తండ్రి అసభ్య ప్రవర్తన

నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు

పహాడీషరీఫ్: ఆరేళ్ల చిన్నారిపై సవతి తండ్రి అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జల్‌పల్లి గ్రామానికి చెందిన దంపతులకు ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కుమార్తె ఉంది. కొంత కాలం క్రితం కుటుంబ కలహాలతో దంపతులు విడిపోగా.. బాలిక తల్లి వద్దే ఉంటుంది. సదరు గృహిణి భర్తతో విడిపోయిన అనంతరం ఆటో డ్రైవర్‌ను రెండో వివాహం చేసుకుంది. రెండో భర్తతో ఆమెకు ఇద్దరు పిల్లల సంతానం కలిగింది. కాగా మొదటి భర్తకు పుట్టిన కూతురుపై వారం రోజులుగా.. భార్య ఇంట్లో లేని సమయంలో తండ్రి స్థానంలో ఉన్న వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. ఇది గమనించిన మరో కుమార్తె తల్లికి చెప్పడంతో, ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు కొనసాగిస్తున్నారు.